


# ప్రతిఘటన

**బలివాడ కాంతారావు**

**కేశవరావు యౌవనపు రోజుల్లో ఎదుట వాళ్లగురించే ఆలోచించాడు కాబట్టి, తన గురించి ఆలోచించుకునే అవకాశం దొరకలేదు. ఇన్నాళ్లకు ఆ అవకాశం దొరికింది. దీపం వెలుతురు జైలు గదిలోనికి నీరసంగా చొచ్చుకుంది. ఇన్నాళ్లకు ఈ గదిలో ఈ రాత్రి తనొక్కడే ఉన్నాడు. మిగతా ఇద్దర్నీ సాయంత్రమే ఎక్కడకో మార్చేశారు. పక్కగదిలోని ఖైదీ కమ్మగా రామదాస కీర్తనలు పాడుకుంటూ నిద్దరపోయాడు.**

యౌవనపు తొలిరోజుల్లో మనిషి ఎప్పుడూ నాలుగు రోడ్ల కూడలిలో నిల్చుంటాడు. ఆగి ఆలోచించి సుఖపడటానికి ఏదో ఒక బాటను ఎంచుకుంటాడు. తను ఎంచుకున్న బాట సరైనదా, కాదా అన్న సందేహం, ఈ క్షణంలోనే కేశవరావుకు కలిగింది. మనసులో ఈ తర్జనభర్జనలకు చోటిస్తే, మనసు మరింత కల్లోలమౌతుందని, ఆ కల్లోలం నుంచి బయటపడాలనే, కల్మషం ఎరగని చిన్ననాటి జీవితాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు.

తనకు బాగా గుర్తున్న ఘట్టం చప్పున తలలో తిరిగింది. తన తండ్రి నరసింహ, తల్లి పార్వతిని



> "మీలో బాగా బతకలేమన్న భయం భక్తిరూపు దాల్చుకుంది. కనిపించని దేముడే మనిషి చేసే అన్యాయాలకు శిక్షిస్తాడని మీరు చేతులు అతనికి జోడిస్తున్నారు. మనిషిలో ఉన్న గొప్ప గుణం ప్రతిఘటన. దాన్ని వదిలేసుకుని సమాజాన్ని నిర్వీర్యం చేస్తున్నారు"

ఎన్నాళ్లనుంచి హింసిస్తున్నాడో తనకు అవగాహన లేదు. కానీ తన ఆరో ఏట అమ్మను కొడ్తుంటే, వెళ్లి తండ్రి చేతిని గట్టిగా కరిచేశాడు. తండ్రి ఆ చేత్తోనో కొడుకుని చితకబాదాడు. ఇలా ఇక్కడ ఉంటే, ఈ ఒక్క సంతానం దక్కదని కామోసు పార్వతి కేశవరావుని పల్లెటూర్లో కన్నవారింట్లో వదలిపోయింది. తనకు ఏడవ ఏట తల్లీ తండ్రీ లేరని తెలిసింది. ఎలాగ పోయారని అడగనూ లేదు. అమ్మమ్మ రత్నమ్మే తన తల్లీ, గురువు. ఆమె ఉమ్మడి కుటుంబానికి పెద్ద. ముక్కులో నత్తు, చేతికి దండకడియం. ఎత్తుగా, తెల్లగా, బలంగా, బంగారు ఛాయతో ఉండేది. ఆ వీధిలో తన వయసువాడే శ్యామసుందర్ ఉన్నాడు. వాడిని ఆ ఇంటికి దీపంలా చూసుకునేవారు. కేశవరావు అప్పటికే పెంకి కుర్రాడని పేరు పడిపోయాడు. వీడితో శ్యామ్ బడిలోనూ, బయటా కలుసుకోవటం తప్పటంలేదు. తన అమ్మమ్మ తనకు చెప్పే కథలు శ్యామ్‌తో చెప్పితే, వాడు వాడి నాన్నమ్మ చెప్పిన ఒక్క కథా చెప్పలేదు.

తన తొమ్మిదో ఏట చింతచెట్టు ఎక్కి, చింతబొట్టను కిందికి విసురుతూ శ్యామ్‌ని తినమంటే, "వద్దు, చింతపిక్క మింగేస్తే కడుపులో మొక్క మొలుస్తుంది. మొక్క చెట్టయి చంపేస్తుంది!" అని తినలేదు. ఆ వయసు వరకు శ్యామ్ అప్పుడప్పుడూ ఇంట్లో మారాం చేసి ఏడ్చేవాడు. ఎందుకలా ఏడుస్తూంటాడని అమ్మమ్మను అడిగితే, ఇంకెవరితో అనవద్దని గుప్తంగా చెవిలో "వాడి మెదడు ఒకపక్క చెడిపోతే, అక్కడ మేక మెదడు పెట్టారు. అందుకే చీటికీ మాటికీ మేకలా అరుస్తూంటాడు. నీది మంచి మెదడు. ఇలా ధైర్యంగా ఉండు! చెట్లెక్కు, చింతపిక్కలు నములు. నీకేం కాదు!" అంది.

ఆ ధైర్యంతో పాలేరు కుర్రాడు కూర్చుని వస్తున్న దున్నపోతు ఎక్కి కూర్చున్నాడు. దున్నపోతు సరాసరి ఏటిలోనికి దూసుకుపోయింది. కేశవరావుకు ఈత రాదు. పాలేరు కుర్రాడే వాడిని ఒడ్డుకు చేరుస్తూ "ఈత నేర్చుకోరాదా?" అని అడిగాడు. అప్పుడే నేర్చమన్నాడు. బాగా ఈత నేర్చుకున్నాక ధైర్యంగా ఈది ఏటి అవతలి ఒడ్డుకు చేరాడు. అప్పుడు ఆకాశంలో పక్షిలా ఆ మేఘాల మీదకి ఎగిరిపోవాలనిపించింది.

సైకిలు తొక్కుతూ పక్క వూర్లో హైస్కూలు చదువు పూర్తి చేశాడు. కాలేజీ చదువుకు పట్నం ఇద్దరూ వెళ్లారు. ఒక గది అద్దెకు తీసుకున్నారు. ఆ ఇంట్లో ఒక అమ్మాయి ఉంది. చక్కగా ఉంది. ఆ ఇంటికి మగ దిక్కు లేదు. ఆ అమ్మాయి గౌరి, బజారు తేవడం నుంచి ఇంటి పనులన్నీ చూసుకునేది. ఒకసారి ఎవరో వీధిన పోయే తుంటరి సరసాలాడబోతే జోడు తీసింది. పరుగెత్తిపోయాడు. ఈ ధైర్యాన్ని చూసిన కేశవరావుకు గౌరి మీద గౌరవం పెరిగింది. గౌరి కేశవరావుతోనే చాలా చనువుగా మాట్లాడేది. ఏమైనా చికాకులు ఎదురుపడితే పరిష్కార మార్గాలు ఇతన్నే అడిగి తెలుసుకునేది. గౌరికి సిగ్గుపడటం, ఎవరేమనుకుంటారన్న భీతి లేదు. ఈ ఇద్దరి కాలేజీ చదువు పూర్తవుతుందన్న సమయంలో ఒక విశేషం జరిగింది. నిద్దరపోతున్న కేశవరావును శ్యామ్ లేపి -

"గౌరి నన్ను పెరట కలుసుకోమంది. వెళ్లేదా?"

"అంత అవకాశం ఏ అదృష్టవంతునికో గానీ దొరకదు. వెళ్లు!" అని ముందుకు తోశాడు.

కాసేపయ్యాక తిరిగివచ్చి వణికిపోతున్నాడు. ఆ అమ్మాయి వీడిని కుస్తీలో ఓడించినంతగా అలసిపోతున్నాడు. కొంతసేపటికి నోరు పెగిలి "నేనంటే ఇష్టమట. నాతో లేచి రమ్మన్నా వచ్చేస్తానంటోంది!" అన్నాడు.

"ఆ మాటే నాతో అంటే వెంటనే ఆ పని చేసేవాడ్ని!" అన్నాడు కేశవరావు.

"తప్పు, తప్పు!" అంటూ ఆ మరుసటి రోజే ఇల్లు ఖాళీ చేసేశాడు.

ఇద్దరి చదువులూ పూర్తి అయ్యాయి. శ్యామ్‌కు పెద్ద అండ, పెద్ద ఖర్చుతో ఉద్యోగం దొరికింది. పెద్ద కట్నంతో పెళ్లి జరిగింది. అందుకే పెద్దవాడైపోయి పదుగురి మన్ననలను పొందుతున్నాడు. ఇక కేశవరావుకు పట్టభద్రుడు అయ్యే అవకాశం ఇచ్చిన మేనమామలు, వాళ్లు పెట్టిన మదుపు వడ్డీతో సహా పుచ్చుకోవాలని చూస్తున్నారు. అమ్మమ్మ పోవడం ఇంట్లో పెద్దరికం ముగ్గురి పెద్దరికాలుగా మారింది. ఏదో ఉద్యోగంలో తల దూరిస్తే గానీ జరగని పరిస్థితి వచ్చింది. కాలేజీ మిత్రుడు తను పనిచేస్తున్న చోటుకు తీసుకువెళ్లాడు. నెల పని చేశాక చేతిలో ఐదు వందలు పెట్టి, వెయ్యి రూపాయలకు సంతకం పెట్టమన్నారు. ఇదేం న్యాయం అంటే అదే న్యాయం అన్నాడా పెద్ద. కేశవరావు ఘర్షణపడ్డాడు. ఫలితం బలవంతంగా బయటకు గెంటివేయబడ్డాడు. మిగతా పనివాళ్లంతా అలా చూస్తున్నారేగానీ ఒక్కడూ ఇది అన్యాయమని ఎదురు తిరగలేదు.

స్నేహితుని ఇంట వారం రోజులు గడిపినప్పుడు వచ్చిన తగువు తన దృష్టిలో చిన్నదైనా, అది పెద్దదైంది. పక్క ఇంటి ఎదరగా ఉన్న మునిసిపల్ కుండీలో ఒక పెద్దమనిషి రెండు చచ్చిన పందికొక్కులను వేస్తుంటే, పక్క ఇంటి మనిషి "మాకు కంపురాదా?" అన్నాడు.

"మునిసిపాలిటీ సిబ్బంది ఎత్తుతారు. నిన్ను ఎత్తమనలేదు!"

"వాళ్లు నాలుగురోజులు రారు. ఆ కంపు మేం భరించాలా?"

"ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో. ఇక్కడ కుండీ ఉన్నంతకాలం చచ్చిన పిల్లినీ, కుక్కనీ ఇందులోనే వేస్తాను!" అన్నాడు పెద్దమనిషి.

కేశవరావు పక్క ఇంటినుంచి విని రంగంలోకి దూకాడు.

"విషం పెట్టి వీటిని చంపావా, లేదా?"

"నా ఇష్టం వచ్చినట్లు చంపుతాను. నీకెందుకు?"

"తిన్నగా తీసుకువెళ్లి దూరంగా ఎక్కడో గోతిలో పాతిపెట్టు!"

"చెయ్యకపోతే ఏం చేస్తావేమిటి?"

"తెల్లవారేసరికి ఈ రెండూ మీ ఇంట్లోనే ఉంటాయి."

పరిస్థితి చెయ్యి దాటిపోకుండా తన మిత్రుడు కేశవరావును ఇంట్లోకి తీసుకుపోయాడు.

"వాడు మునిసిపల్ మనిషి. ఇక్కడ వాడి మాటకు తిరుగు లేదు!"

"ఏం చేస్తున్నాడేమిటి?"

"చేసినది పెద్ద ఉద్యోగం కాదు. వాడి జీతానికి పదిరెట్లు లోపాయికారీ సంపాదన."

ఇలా రేషన్ షాపుల్లో, ఎక్కడెక్కడ అన్యాయాలు జరుగుతున్నాయో అక్కడ జోక్యం చేసుకుని అరుస్తున్నాడు. స్నేహితుని ఎన్నాళ్లు ఇబ్బంది పెట్టగలడు? పదిచోట్లకు దరఖాస్తులు పెడ్తే ఒక పట్నం నుంచి ఇంటర్వ్యూకు రమ్మని వచ్చింది. పెద్ద మేనమామ దగ్గర అప్పు తీసుకుని ఇంటర్వ్యూకు వెళ్లాడు. స్టేషనులో దిగి బయట పెద్ద రద్దీగా ఉన్న బస్సుస్టాప్‌లో క్యూలో నిల్చున్నాడు. ఒకడు క్యూ మధ్యలో చేరితే అంతా ఊరుకున్నా, ఒకావిడ కేకలు వేసింది. ఆ ఘర్షణలో కేశవరావు ఆమెకు సహాయంగా నోరు చేసుకున్నాడు. బస్సు ఇంకా రాలేదు. ఆమె అడిగింది "మీరెక్కడకు వెళ్తారు?"

"ఇంటర్వ్యూకు వచ్చాను. ఈ ఊరికి కొత్త. ఏదైనా చౌక హోటలు పేరు చెప్తారా?" అంటే,

"మీకు అభ్యంతరం లేకపోతే మా ఇంటికి రండి!" అని తీసుకువెళ్లింది. చిన్న ఇల్లు. ఇంట్లో తల్లి తప్పించి ఇంకెవరూ లేరు. తనకన్నా వయసులో పెద్ద. ఇంకా పెళ్లి కాలేదు. రెండు రోజులు ఆమె వైఖరిని చూశాక పెళ్లి ప్రస్తావన తెచ్చాడు.

"నన్నే పెళ్లి చేసుకోవాలని ఎందుకనుకుంటున్నారు?" అని అడిగింది.

"మీ సాహసం చూసి."

"ప్రతి వ్యక్తీ తను చేసింది సబబే అనుకుంటాడు. ఎదుటివాళ్లు అడ్డు తగిలితే సహించలేడు. ఈ అడ్డు తగిలేవాళ్లు సాహసించడానికి అండదండలు కావాలి. మీ దగ్గర లేవు!"

ఉద్యోగం దొరకలేదు. ఉద్యోగం దొరికి ఉంటే బహుశా ఆమె తనను పెళ్లి చేసుకోడానికి ఒప్పుకునేదేమోనని అనుకున్నాడు.

తిరిగి వచ్చాక ఒక రోజు తన చుట్టాల అబ్బాయి పెళ్లి చూపులకు వెళ్తూ తనను పిలిస్తే వెళ్లాడు. పెళ్లి కూతురు రమణి. ప్రైమరీ స్కూలు టీచరుగా పనిచేస్తోంది. అమ్మాయి కురూపిలా ఉందని తిరిగి వచ్చిన పెళ్లి కొడుకు తీర్పు. అంతటితో ఊరుకుంటే బాగుండేది. కొన్ని అసభ్యకరమైన వ్యాఖ్యలు చెయ్యగానే సహించలేక "నోరు ముయ్యరా! నీకే అలాంటి చెల్లెలుంటే ఇలా వ్యాఖ్యానిస్తే ఊరుకుంటావా?" అన్నాడు.

"అంత కనికరం ఉంటే నువ్వే పెళ్లి చేసుకోకూడదూ?" అనగానే, తిన్నగా తిరిగి వాళ్లింటికి వెళ్లి, తన పరిస్థితిని చెప్పుకున్నాడు. "నన్ను దుడుకు మనిషి అంటారు. అన్యాయాన్ని సహించలేను. పోట్లాడతాను. న్యాయంగా పోయి ఉద్యోగం సంపాదించలేని పట్టభద్రుడ్ని. మీకు అభ్యంతరం లేకపోతే నేను పెళ్లి చేసుకుంటాను!" అన్నాడు.

రమణి ఒప్పుకున్నట్లు తల ఊపింది. కేశవరావు ఏం చేసినా, ఏ తగువులు తెచ్చుకున్నా ప్రశ్నించలేదు. ఏం చెప్పినా వినేది ఒపిగ్గా. వ్యాఖ్యానాలు చెయ్యలేదు. కొడుకు పుట్టగానే ఆమె సగం శ్రద్ధ పిల్లాడిమీదకు మళ్లింది.

కడుపుకు వెతుక్కునే అవసరం లేని కేశవరావు ప్రజల్లో పడి తనకు నచ్చని విషయాలు, వ్యక్తులమీద మాటల వర్షం కురిపిస్తున్నాడు. భక్తిలోపడ్డ వాళ్లను చూసి, "మీలో బాగా బతకలేమన్న భయం భక్తిరూపు దాల్చుకుంది. కనిపించని దేముడే మనిషి చేసే అన్యాయాలకు శిక్షిస్తాడని మీరు చేతులు అతనికి జోడిస్తున్నారు. మనిషిలో ఉన్న గొప్ప గుణం ప్రతిఘటన. దాన్ని వదిలేసుకుని సమాజాన్ని నిర్వీర్యం చేస్తున్నారు" అనీ, కోర్టులు, లాయర్ల చుట్టూ తిరుగుతూ, "అమలుపరచలేని శాసనాల కట్టలు పెరిగిపోతుంటే మీరేం న్యాయం కూరుస్తారు"నీ సవాలు చేస్తున్నాడు. దోపిడి అన్ని రంగాల్లో ఒక వ్యవస్థగా, గౌరవం తెచ్చుకున్న నిర్వీర్యమైన సంఘాన్ని తను మరమ్మత్తు చెయ్యాలన్న ఆత్రుత పెరిగిపోతోంది. సామాన్య ప్రజలను మాటలతో మభ్యపరిచి అన్ని వర్గాల్లో చీలికలను ఏర్పరచే రాజ్యాంగ వ్యవస్థపై తనకు నమ్మకం పోయింది. ఇంత అధ్వాన్నంగా పరిస్థితులుంటే తనేమీ చెయ్యలేకపోతున్నానన్న నిస్పృహ తనను కుంగదీస్తోంది.

చీకటిపడింది. ఆకాశం మేఘాలతో నిండి ఉంది. ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఎవరితోనో కలిశాడు. వాళ్ల ఊహలు తన ఊహలతో ఇంచుమించు సరిపోయాయి. వాళ్లతో చేరి ఏదో మంచి చెయ్యగలనన్న ఆశ చిగురించింది. రోడ్డువారనుంచి ఏకాంతంగా నడుస్తూ వస్తుంటే చప్పున ఒక స్త్రీ ఆర్తనాదం వినిపించింది. అదేమీ కానట్లు ఇరుగు పొరుగు వాళ్లు చూస్తున్నారు. ఏమైందని అక్కడే నిల్చున్న పొరుగు వానిని అడిగితే, "రోజూ ఉన్న భాగోతమే! తాగుతాడు. పెళ్లాన్ని తంతాడు!" అన్నాడు.

"మీరంతా చూస్తూ ఎలా ఊరుకున్నారు?"

"మమ్మల్ని తంతాడని భయం. ఆ పెళ్లామే ఇతరుల జోక్యానికి ఒప్పుకోని పతివ్రత."

వాన ఒక్కసారి దబదబ వచ్చి పడింది. ఆ వ్యక్తిలోనికి పరుగెత్తాడు.

పెళ్లాన్ని కొడుతున్న మగాడు ఆమె జుత్తు పట్టుకుని బయట వానలోనికి లాక్కొచ్చి బాదుతున్నాడు. కేశవరావుకు చిన్ననాట తన అమ్మను కొడుతున్న నాన్న - దృశ్యం గుర్తుకొచ్చింది. అంత కోపం వచ్చి వాడిని అడ్డుకుంటే వాడు కేశవరావుమీద పడ్డాడు. ఆ తోపులాటలో ఆ మగడు కాలుజారి పడ్డాడు. తల వెనుకభాగం వరండా మెట్లమీద పడింది. అక్కడికక్కడే చనిపోయాడు. తన పసుపు కుంకుమను కేశవరావే చెరిపేశాడని, కావాలనే తోసేశాడని సాక్ష్యం ఇచ్చింది. తన తండ్రిని అడ్డుకుంటే, తల్లి ప్రాణం తనను కన్నవారింటిలో చేర్చింది. ఈ ఇల్లాలి తాగుడు భర్తను అడ్డుకుంటే - మూడేళ్లు కటకటాల వెనుక బతికే బతుకు దొరికింది.

ఇంతవరకూ ఈ ఆలోచనలతో నిండిన మనసు అర్ధరాత్రికి అయోమయ అవస్థలో పడ్డట్లు చేసింది. ఏమీ సాధించలేని బతుకయిపోయిందన్న నిస్సహాయతతో తన మెదడూ ఒక పక్క కుళ్లిపోయిందనిపించింది. బహుశా తన మెదడూ మేక మెదడులా మారిపోతున్నదన్న అనుమానం వేసి, మేకలా అరుస్తుంటే జైలు గార్డు లాఠీ చూపించాడు. "కడుపులో చింతచెట్టు పెరిగింది. బాధను భరించలేకపోతున్నాను!" అన్నాడు. వీడికేదో పిచ్చి పట్టిందని నోరు మూసుకుని పడుకోమని కేకలేశాడు. నిద్దరపట్టలేదు. బతకాలన్న ఆశ కూడా చచ్చిపోయింది. కాళ్లూ చేతులూ విరిగి, కంటి చూపు పోగొట్టుకున్నవానిలా కూలబడిపోయాడు.

ఆ మరుసటి రోజు రమణి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

"ఇన్నాళ్లూ మీతో చెప్పని విషయం ఒకటి చెప్పదలిచాను. మీ ఉదారతను చూసి నేను మిమ్మల్ని కట్టుకోలేదు. నాకు బిడ్డ కావాలన్న కోరిక బలంగా ఉండటంవల్లనే మిమ్మల్ని కట్టుకున్నాను. రమేష్ ఈ ఏడాది క్లాసులో ఫస్టుగా పాసయ్యాడు. వీధిలో నలుగురు పిల్లలను చేర్చి చదువు కూడా చెప్తున్నాడు. పరుగుపందెంలో గెల్చాడు.

"సంఘంలో ఏదైనా మంచి సాధించాలంటే చేత అధికారమైనా ఉండాలి, లేక పదుగురూ వెంటపడే నాయకత్వమైనా ఉండాలి. ఇవేవీ లేకుండా ఏదో సాధిస్తామంటే వీలు పడదని నమ్మినదాన్ని. అందుకే రమేష్‌ని తెలివితేటలతో, నలుగుర్ని ఆకట్టుకునే చాకచక్యంతో ఒక ఉన్నతాధికారిగానో, నాయకునిగానో తీర్చిదిద్దాలన్నదే నా ప్రయత్నం!"

ఉత్తరం చదివాక తన భార్య తన ఎదురుగా నిల్చుని చీర కొంగుతో తన కన్నీరు తుడిచినట్లనిపించింది. ■

